# రైతు ఆశీర్వాద సభ కాదు... కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతు శాపనార్థాల సభ

## ప్రజా ధనంతో పబ్లిసిటీ స్టంట్లు బంద్ చేసి...హామీల అమలుపై దృష్టి పెట్టండి

## ఉద్యమ నేత, తెలంగాణ జాతిపిత కేసీఆర్‌తో..ఓటుకు నోటు దొంగ రేవంత్ రెడ్డికి పోలికా ?

## నేను మాట ఇస్తే తప్పను" అని అన్న రేవంత్ రెడ్డి ది ప్రపంచంలో నే 8వ వింత

## రుణమాఫీ కాదు . . రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న నమ్మకం మాఫీ అయ్యింది

## మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

వేల్పూర్, బతుకమ్మ :రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో రైతుల పరిస్థితి రోజురోజుకు దారుణంగా మారుతుంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం కేవలం ప్రచార ఆర్భాటాలకే పరిమితమయ్యారని మాజీ మంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శించారు. నిన్న శిల్పకళా వేదికలో నిర్వహించింది రైతు ఆశీర్వాద సభ కాదని . . అది అన్నదాతల శాపనార్థాల సభ అని అన్నారు. బుధవారం వేల్పూర్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ రుణమాఫీ చేయనందుకా, రైతుబంధు ఎగ్గొట్టినందుకా, వడ్లు కొననందుకా, యూరియా ఇవ్వనందుకా, కరెంట్ కట్ చేస్తున్నందుకా, దేనికి రైతులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఆశీర్వదించాలి అని ప్రశాంత్ రెడ్డి ప్రశ్నించారు. ఈ సభల ఖర్చు చూస్తుంటే "చారాణా కోడికి బారాణా మసాలా" అన్న చందంగా ఉందని ఎద్దేవా చేశారు. గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎలాంటి ఆర్భాటాలు??, వృధా ఖర్చులు లేకుండా కేవలం ఒక ప్రెస్ మీట్ ద్వారా ప్రకటించి, 11 సీజన్లలో రూ. 73వేల కోట్ల రైతుబంధు నిధులను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశారని గుర్తు చేశారు. ఒక్క రూపాయి కూడా ప్రజాధనాన్ని వృధా చేయలేదన్నారు. కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు సీజన్లలో మూడు సీజన్ల రైతుబంధు ఎగ్గొట్టి ??దాదాపు రూ. 28 వేల కోట్లు రైతులకు బాకీ పడిందని అన్నారు. ఈ రూ.28 వేల కోట్ల పాత బాకీలో నుంచి కేవలం రూ.2500 కోట్లు విదిల్చి?? దాని కోసం వందల కోట్లతో సభలు పెట్టి అట్టహాసం చేయడం హాస్యాస్పదమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తదుపరి ఇవ్వబోతామంటున్న రూ. 9 వేల కోట్లు కూడా రైతుల పాత బాకీల కిందికే వస్తాయని, కొత్తగా ఇస్తున్నదేమీ లేదని స్పష్టం చేశారు. ఒకవేళ కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పినట్లు ఎకరాకు రూ. 15 వేల చొప్పున ఇస్తే రైతులకు రూ. 55వేల కోట్లు ఇవ్వాల్సి ఉంటుందని, కానీ ఇచ్చింది కేవలం రూ. 27 వేల కోట్లేనని ??ఇంకా రూ.28 వేల కోట్లకు పైగా రైతుబంధు నిధులను ప్రభుత్వం ఎగ్గొట్టిందని మండిపడ్డారు. బాల్కొండ నియోజకవర్గంలో 52 వేల మంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉండగా, కేవలం 22 వేల మందికే జరిగిందని, మిగిలిన 30 వేల మంది రైతులు ఇప్పటికీ బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని పేర్కొన్నారు. నిన్నటి రైతు సభలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ కేవలం స్వల్పకాలిక రుణాలు? మాత్రమే మాఫీ చేస్తామని చెప్పడం రైతాంగాన్ని నట్టేట ముంచడమేనని మండిపడ్డారు. రుణమాఫీ కాదు.. రైతులకు



కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న నమ్మకం మాఫీ అయ్యింది" అని ఎమ్మెల్యే అన్నారు. మంత్రి తుమ్మల ఏసీ రూముల్లో కూర్చొని యూరియా యాప్ బాగుందని, 90 శాతం రైతులు సంతోషంగా ఉన్నారని మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేవలం రెండున్నరేళ్లలోనే ఏకంగా రూ. 4 లక్షల కోట్ల అప్పులు తెచ్చిందని, ఈ నిధులతో ఎం కట్టారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సంస్కారహీనమైన భాషను, కేసీఆర్ పై చేస్తున్న వ్యక్తిగత దూషణలను మానుకోవాలని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశం లో రేగుంట దేవేందర్?, జెడి నాగధర్ రెడ్డి, కల్లెడ ఏలియా ఆర్మూర్ మహేష్, బద్దం చిన్నారెడ్డి, రేగుల్లా రాములు, బద్దం అశోక్, కుంట ప్రతాపరెడ్డి, పాపాయ్ పవీన్, బోగా ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు వినియోగించుకోవాలి

## నగర మేయర్ కూరగాయల ఉమారాణి



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు వినియోగించుకుని చదువులో ముందు ఉండాలని నగర మేయర్ కూరగాయల ఉమారాణి అన్నారు. బుధవారం జీపీఎస్ కోట గల్లి శంకర్ భవర్ ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగ తి వరకు చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు ఉచిత పుస్తకాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మే యర్ విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నదని తెలి పారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి స్వయంగా విద్యా ర్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించారు. భోజనం నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తరగతి గదులను పరిశీలించారు. పాఠశాలకు మున్సిపల్ నల్ల ద్వారా మంచి నీటిని సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ మెంబర్ సర్దార్ నరేందర్ సింగ్, కాంగ్రెస్ నాయకులు సయ్యద్ కైసర్, కరాటే రమేష్, ప్రధానో పాధ్యాయులు రామచందర్ గైక్వాడ్, ఉపాధ్యాయులు దయానంద్, మమత, ప్రసన్న, లక్ష్మి, సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుండి ధర్పల్లి వైపు వెళ్లే రోడ్డు మూసివేత...

## లింగాపూర్ వాగు వద్ద నూతనంగా నిర్మించిన బ్రిడ్జి పనుల పునః ప్రారంభం

## వేసవికాలంలో చేయాల్సిన పనులను వర్షాకాలంలో మొదలుపెట్టడంపై పలువురు అసంతృప్తి..

## జులై 25 వరకు రాకపోకలు నిలిపివేత



ఇందల్వాయి జులై 1 బతుకమ్మ ఇందల్వాయి మండల పరిధిలోని లింగాపూర్ వాగు వద్ద ఇటీవల నూతనంగా నిర్మించిన బ్రిడ్జి వద్ద మట్టి రోడ్డు కృంగిపోవడంతో పనులను నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి ఆదేశాల మేరకు పునః ప్రారంభం చేస్తున్నారని ఇందల్వాయి ఎస్సై సుమలత తెలిపారు. దీంతో జులై 2 నుండి జులై 25వ తేదీ వరకు పనులు కొనసాగుతాయని ప్రయాణికులు గమనించి తిరుమల్ పల్లి నుండి రాంపూర్ లోలం ఎల్లారెడ్డిపల్లి మీదుగా ధర్పల్లి వెళ్లాలని ఆమె సూచించారు. ప్రయాణికులు ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల కోసం సహకారం అందించాలన్నారు. కానీ వేసవి కాలంలో చేయాల్సిన పనులను వర్షాకాలం ప్రారంభమైన తర్వాత సంబంధిత కాంట్రాక్టర్ పనుల పునః ప్రారంభంపై మండలానికి చెందిన పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇందల్వాయి నుండి ధర్పల్లి సిరికొండ భీమ్గల్ వరకు ఏకైక మార్గం అయినా ధర్పల్లి రోడ్డును సుమారు 25 రోజులు మూసి వేయడం పై పలువురు ప్రయాణికులు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వేసవికాలంలో పనులు పూర్తి చేయవలసిందిగా ప్రభుత్వాలున్నప్పటికీ ఎందుకు నిర్లక్ష్యం చేశారని ప్రశ్నిస్తున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే పనులు నత్త నడక నా కొనసాగుతున్నాయని ఇందల్వాయి ధర్పల్లి సిరికొండ మండలం చెందిన పలువురు ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా ప్రత్యేక శ్రద్ధ వహించి నాణ్యత ప్రమాణాలతో పనులు పూర్తిచేసే విధంగా పర్యవేక్షించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# నిజామాబాద్‌లో 'ఆపరేషన్ ముస్కాన్-XII' ప్రారంభం

## తప్పిపోయిన, నిరాశ్రయ చిన్నారుల గుర్తింపు, పునరావాసమే లక్ష్యం






నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో తప్పిపోయిన, నిరాశ్రయ, వీధి బాలలు, బాల కార్మికులుగా మారే ప్రమాదంలో ఉన్న చిన్నారులను గుర్తించి రక్షించేందుకు చేపట్టిన 'ఆపరేషన్ ముస్కాన్-XII' కార్యక్రమాన్ని బుధవారం అదనపు డీసీపీ (అడ్మిన్) ఎన్. శుభం ప్రకాష్ ప్రారంభించారు. పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు పోలీస్ కమిషనర్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ హాల్‌లో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన అదనపు డీసీపీ, జూలై 1 నుంచి జూలై 31, 2026 వరకు నెల రోజుల పాటు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి చిన్నారులను గుర్తించి రక్షించే చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పోలీసు శాఖ ఆధ్వర్యంలో మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, విద్యాశాఖ, బాలల సంరక్షణ విభాగం, జిల్లా బాలల పరిరక్షణ యూనిట్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఆపరేషన్‌లో భాగంగా రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్లు, మార్కెట్లు, హోటళ్లు, ధాబాలు, పరిశ్రమలు, ఇటుక బట్టీలు, గ్యారేజీలు, వర్క్‌షాపులు, నిర్మాణ ప్రాంతాలు, ధార్మిక క్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలు తదితర ప్రజా ప్రదేశాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టి బాల కార్మికులు, నిరాశ్రయ బాలలు, వీధి బాలలు, తప్పిపోయిన చిన్నారులను గుర్తించి రక్షించి, సంబంధిత అధికారుల సమక్షంలో పునరావాసం కల్పించనున్నట్లు తెలిపారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనతో పాటు ప్రతి చిన్నారికి విద్య, భద్రత, ఆరోగ్యం, రక్షణ కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని అదనపు డీసీపీ పేర్కొన్నారు. చిన్నారులను పనుల్లో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని, అలాంటి ఘటనలు గుర్తించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమాచారం అందించేందుకు నిజామాబాద్ డివిజన్ ఇన్‌చార్జ్ ఎస్ఐ (8712578236), ఆర్మూర్ డివిజన్ ఇన్‌చార్జ్ ఎస్ఐ (8712659863), బోధన్ డివిజన్ ఇన్‌చార్జ్ ఎస్ఐ (9985197899)లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ పాండేరావు, ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ ఏ. సురేష్, జిల్లా వెల్ఫేర్ అధికారి, మహిళా చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ డి. సౌందర్య, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ చైతన్య, జిల్లా అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సిహెచ్. ప్రభుదాస్, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ కల్పన, డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయం ప్రతినిధి వెంకటేష్, జిల్లా కలెక్టరేట్ సూపరింటెండెంట్ బి. భాస్కర్, జిల్లా విద్యాశాఖ ప్రతినిధి బి. బాలకృష్ణారావుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా "సైబర్ జాగ్రూకత దివస్"



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా బుధవారం సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్, నిజామాబాద్ ఆధ్వర్యంలో నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాల, మేఘనా డెంటల్ కళాశాలలో వైద్యులు, అధ్యాపకులు, ఇంటర్న్‌లు, వైద్య విద్యార్థుల కోసం "సైబర్ జాగ్రూకత దివస్" పేరుతో విస్తృత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభంలో సమాజ ఆరోగ్య పరిరక్షణలో విశేష సేవలందిస్తున్న వైద్యులను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించి, జాతీయ వైద్యుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సైబర్ క్రైమ్ పోలీస్ అధికారులు మాట్లాడుతూ, నేటి డిజిటల్ యుగంలో వైద్యులు, వైద్య విద్యార్థులు కూడా సైబర్ నేరస్థుల లక్ష్యంగా మారుతున్నారని పేర్కొన్నారు. ఆసుపత్రులు, వైద్య సంస్థలు, వ్యక్తిగత బ్యాంకు ఖాతాలు, డిజిటల్ చెల్లింపుల ద్వారా జరుగుతున్న మోసాల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ సందర్భంగా బాస్ స్కామ్, ప్రకటనల ద్వారా మోసాలు, గుర్తింపు చోరీ, క్రెడిట్/డెబిట్ కార్డు మోసాలు, అలాగే డిజిటల్ అరెస్ట్, ఫిషింగ్, క్యూఆర్ కోడ్, యుపిఐ, ఎపికె ఫైల్ మోసాలు వంటి వివిధ రకాల సైబర్ నేరాల గురించి వివరంగా అవగాహన కల్పించారు. వ్యక్తిగత సమాచారం, ఆధార్, పాన్, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, పాస్‌వర్డ్ లు, యుపిఐ పిన్, క్రెడిట్/డెబిట్ కార్డు వివరాలు వంటి గోప్యమైన సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. తెలియని లింకులను క్లిక్ చేయకుండా, అపరిచిత మొబైల్ యాప్‌లను డౌన్‌లోడ్ చేయకుండా, సోషల్ మీడియా, ఆన్‌లైన్ షాపింగ్‌లో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్కు కాల్ చేయడం లేదా www.cyber-crime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయడం ద్వారా నష్టపోయిన నగదును తిరిగి పొందే అవకాశాలు మెరుగు పడతాయని అధికారులు వివరించారు. వైద్య విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, సమాజంలోని ఇతరులకు కూడా సైబర్ భద్రతపై అవగాహన కల్పించి, ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండేలా సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్ర మంలో పాల్గొన్న వైద్యులు, అధ్యాపకులు, విద్యార్థులు సైబర్ భద్రతపై తమ సందే హాలను నివృత్తి చేసుకుని, ఇటువంటి అవగా హన కార్యక్రమాలు తరచుగా నిర్వహించా లని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రమణరావు, ఎస్ఐలు ప్రవళిక, రవి నాయుడు తదితరులు పాల్గొన్నారు. మొత్తం 560 మంది వైద్యులు, అధ్యాపకులు, ఇంటర్న్‌లు, వైద్య విద్యార్థులు ఈ అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు.